భద్రత ముఖ్యం



కోల్‌కతాలో వైద్యురాలిపై అత్యాచారం, హత్య సంఘటన లాంటి ఘటనలు భవిష్యత్తులో పునరావృతం కాకుండా దేశ వ్యాప్తంగా భద్రతా చర్యలు తీసుకోవాలి. ఇదే క్రమంలో ఇలాంటి ఘాతుకాలకు పాల్పడిన వ్యక్తులకు అత్యంత వేగంగా కఠిన చర్యలు తీసుకోవాలి. ప్రభుత్వాసుపత్రులలో వైద్య సేవలు అందిస్తున్న వైద్య సిబ్బందికి భద్రత, భరోసా కల్పించాలి. ప్రత్యేకమైన చట్టాలు తీసుకురావటం ద్వారా మహిళా వైద్యులు వైద్య సేవలను ఉత్సాహం అందిస్తారు. – పీవీ నాగేశ్వరరావు, ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్, రాజంపేట

సమాజంలో మార్పు అవసరం



మహిళల విషయంలో సమాజంలో మార్పు రావాలి. ముఖ్యంగా ప్రజల ప్రాణాలను కాపాడుతున్న వైద్యుల పట్ల ఇలాంటి క్రూరమైన ఆలోచనలు రావడం బాధాకరం. కోల్‌కతా లాంటి ఘటనలు పునరావృతం కాకుండా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు తీసుకోవడంతో పాటు డాక్టర్లు నిర్భయంగా విధులు నిర్వర్తించేందుకు భరోసా ఇవ్వాలి. – ఎస్ అశ్విని చంద్ర, ప్రభుత్వ వైద్య నిపుణులు, ఆకేపాడు పీహెచ్‌సీ, వైద్య సెంటర్



సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలి



మహిళా డాక్టర్‌పై కోల్‌కతాలో జరిగిన సంఘటన పునరావృతం కాకుండా వైద్యులు, వైద్య సిబ్బంది రక్షణకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పటిష్టమైన చట్టాలను అమలు చేయాలి. రాత్రి వేళల్లో వైద్యశాలలో విధులు నిర్వహించే మహిళా డాక్టర్‌లకు, సిబ్బందికి రక్షణ కల్పించాలి. గ్రామీణ ప్రాంతాల పీహెచ్‌సీలకు రాత్రి వేళ పోలీసు సెక్యూరిటీ కల్పించాలి. సీసీ కెమెరాలను ఏర్పాటు చేయాలి. – డాక్టర్ శ్రీవిద్య, మాధవరం పీహెచ్‌సీ, సిద్దవటం మండలం

రక్షణ కల్పించాలి



రోగులకు ప్రాణం పోస్తున్న డాక్టర్లు, నర్సింగ్ సిబ్బందిపై దాడులు చేస్తున్నారు. ఇది దారుణం, ఇలాంటి వారిపై కఠినంగా వ్యవహరించాలి. దాడులు, కించపరిచేలా మాట్లాడేవారిపై ప్రభుత్వం కఠినంగా వ్యవహరించాలి. ఆసుపత్రిల్లో రాత్రివేళ డ్యూటీలు చేస్తున్న డాక్టర్‌లకు, నర్సులకు వైద్య సిబ్బందికి ఒక మహిళా పోలీసును సెక్యూరిటీగా నియమించి రక్షణ కల్పించాలి. – దేవప్రియా కార్తీకేయన్, స్టాఫ్ నర్సు, సీహెచ్‌సీ, సిద్దవటం

క్లుప్తంగా

అమ్మపేరిట మొక్క నాటండి



గువ్వల చెరువులో ఘాట్‌లో మొక్కలు నాటుతున్న ఫారెస్ట్ అధికారులు

రామాపురం : ప్రతి ఒక్కరూ అమ్మపేరిట మొక్క నాటాలని కడప డివిజన్ పరిధిలోని ఫారెస్ట్ సెక్షన్ అధికారి షకీలా ఆహమ్మద్ కోరారు. శనివారం మండల పరిధిలోని గువ్వలచెరువు ఘాట్ ఈకో అరణ్య టూరిజం పార్క్ వద్ద 30 రకాల మొక్కలను నాటారు. ఈ ఘాట్‌లో అరణ్య టూరిజం ఏర్పాటు చేయడం ఆనందంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఫారెస్ట్ ఎఫ్‌బీఓ బాషా, బీట్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా శివపార్వతుల కల్యాణం



ప్రత్యేక అలంకరణలో శివపార్వతులు

నందలూరు: నందలూరులోని వరసిద్ది వినాయక స్వామి ఆలయంలో శనివారం ఉదయం శివపార్వతుల కల్యాణం అత్యంత వైభవంగా నిర్వహించారు. ఆలయ అర్చకులు నరసా రవి కుమార్ శర్మ బృందం ఆధ్వర్యంలో వేదమంత్రాల నడుమ భక్తి శ్రద్ధలతో కళ్యాణం కన్నుల పండువగా జరిగింది. అనంతరం మధ్యాహ్నం భక్తులకు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు.

మండల సమావేశం వాయిదా

ఒంటిమిట్ట: కోరం లేక ఒంటిమిట్ట మండల సమావేశం వాయిదా పడింది. ఎంపీడీఓ కార్యాలయంలో శనివారం జరగాల్సిన మండల సర్వసభ్య సమావేశం కోరం లేకపోవడంతో వాయిదా పడినట్లు ఎంపీడీఓ రెడ్డయ్య తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో పలు సమస్యల పరిష్కారానికి శనివారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహించాలని అధికారులు నిర్ణయించగా, కోరం లేకపోవడంతో సమస్యల పరిష్కారాల కోసం నిర్వహించాల్సిన మండల సర్వసభ్య సమావేశం రద్దయినట్లు ఆయన తెలియజేశారు.

వైభవంగా వెంకయ్యస్వామి ఆరాధన



చెక్క భజనలతో వెంకయ్యస్వామికి గ్రామోత్సవం

రైల్వేకోడూరు అర్బన్: రైల్వేకోడూరులోని వెంకయ్య స్వామి ఆలయంలో ఆరాధనా మహోత్సవాల్లో భాగంగా చివరిరోజు శనివారం వైభవంగా నిర్వహించారు. ఉదయం నుంచి భక్తులు పాల్గొని ప్రత్యేక పూజలు, అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. అలాగే భక్తి శ్రద్ధలతో హోమాలు, పూజలు చేశారు. ఆలయం నుంచి పట్టణంలోని ప్రధాన రహదారిలో చెక్క భజనలు, మేళ వాయిద్యాలతో వెంకయ్యస్వామి ఉత్సవ మూర్తిని ఊరేగించారు. ఈ కార్యక్రమంలో కారుమంచి చంద్రయ్య, కారుమంచి ప్రభాకర్, గల్లా వెంకటరమణ, ప్రసాద్, శివకుమార్, మోహనరంగయ్య, చీర్ల సుబ్రమణ్యం, భక్తులు పాల్గొన్నారు.

పంట నమోదు తప్పనిసరి



వరిపంటను పరిశీలిస్తున్న జిల్లా వ్యవసాయ అధికారి

వీరబల్లి: ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి రైతులు తాము పండించే పంటల వివరాలను నమోదు చేయించుకోవాలని అన్నమయ్య జిల్లా వ్యవసాయ అధికారి చంద్రనాయక్ తెలిపారు. శనివారం ఆయన మండలంలోని పెద్దవీడు పంచాయతీలో రైతులు సాగు చేసిన వరిపంటను పరిశీలించారు. ఇందులో భాగంగా రైతులతో ఆయన మాట్లాడుతూ సకాలంలో పంటను వేయడమే కాకుండా సాగులో జాగ్రత్తలు పాటిస్తూ సంబంధిత అధికారుల సలహాలు తీసుకోవాలని సూచించారు. రసాయన ఎరువులు కన్నా కృత్రిమ ఎరువులు వాడితే అధిక దిగుబడులు వస్తాయని పేర్కొన్నారు.

ఘనంగా శ్రావణమాస పూజలు



సిద్దవటం: ఆంజనేయ స్వామికి పూజలు చేస్తున్నా దృశ్యం



గాలివీడు : పూజల్లో పాల్గొన్న భక్తులు

సంబేపల్లె : మండల వ్యాప్తంగా భక్తులు భక్తిశ్రద్ధలతో శ్రావణ శనివారం పూజలు నిర్వహించారు. మండలంలోని గుట్టపల్లె, సంబేపల్లె, పీఎన్ కాలనీ, దుద్యాల, గున్నికుంట్ల, మోటకట్ల, శెట్టిపల్లె , రౌతుకుంట, దేవపట్ల, గ్రామాలలోని శ్రీ ఆంజనేయ స్వామి మూల విరాట్‌లను శుద్ధి చేసి స్వామి వారికి నూతన వస్త్రాలతో అలంకరించి ధూపదీప నైవేద్యాలను సమర్పించారు. అర్చన, అభిషేకాలు, ఆకుపూజ, సింధూరార్చన వంటివి నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదానంతో పాటు తీర్థప్రసాదాలను పంపిణీ చేశారు.

భక్తులతో పోటెత్తిన ఆలయాలు

గాలివీడు : శ్రావణ మాసం మూడవ శనివారం సందర్భంగా పలు ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. మండలంలోని బ్రాహ్మణవీధి శ్రీవేంకటేశ్వర స్వామి ఆలయం, కుమ్మరపల్లి చెరువుకట్టపై ఉన్న ఆంజనేయ స్వామి ఆలయం, గండిమడుగు శ్రీ ఉమామహేశ్వర స్వామి ఆలయం, గోరాన్ చెరువు గుట్ట ఆంజనేయ స్వామి ఆలయాల్లో విశేష పూజలు, అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. ఉదయం నుంచే స్వామివారి దర్శనార్థం భక్తులు బారులు తీరారు. అనంతరం దాతల సహకారంతో భక్తులకు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు.

ప్రత్యేక పూజలు

లక్కిరెడ్డిపల్లె: మండలంలోని రాయచోటి–వేంపల్లె రహదారి మార్గంలో వెలసిన శ్రీ లక్ష్మీనరసింహ స్వామి ఆలయం, లక్కిరెడ్డిపల్లె టౌన్‌పరిధిలోని విశ్వభారతీ హైస్కూల్ సమీపంలో వెలసిన ఆంజనేయస్వామి ఆలయంలో శ్రావణమాసం మూడవ శనివారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు.అర్చకులు వెంకటనారాయణ స్వామి ఆధ్వర్యంలో స్వామి వారిని పట్టు వస్త్రాలతో అలంకరించారు.ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

అన్నదానం మహాదానం

రాయచోటి టౌన్ : అన్ని దానాల కన్నా అన్నదానం గొప్పదని రాష్ట్ర రవాణా, క్రీడల, యువజన శాఖ మంత్రి మండిపల్లె రాంప్రసాద్‌రెడ్డి అన్నారు. శనివారం రాయచోటి కొత్తపేటలోని శివరామాలయంలో శ్రావణమాసంలో భాగంగా శ్రావణ శనివారం ఉదయం నుంచి శివపార్వతులకు విశేషమైన పూజలు నిర్వహించారు. ఈ పూజలలో ఆయన ముఖ్య అతిధిగా పాల్గొని పూజలు నిర్వహించారు. అనంతరం దాతల సహకారంతో ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. ప్రతి ఒక్కరూ భక్తిభావాలను అలవర్చుకొని ఇలాంటి మంచి కార్యక్రమాలను నిర్వహించాలని నిర్వాహకులకు సూచించారు.

సిద్దవటం: మండలంలోని పెద్దపల్లి గ్రామ పంచాయతీ పరిధిలోని రామస్వామిపల్లె ఎస్టీ కాలనీ సమీపంలో వెలసిన ఆంజనేయస్వామికి మూడవ శ్రావణ శనివారం సందర్భంగా భక్తి శ్రద్ధలతో పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులు స్వామివారిని దర్శించుకొని కాయా కర్పూరం సమర్పించి తీర్థ ప్రసాదాలను స్వీకరించారు.



సంబేపల్లె: ప్రత్యేక అలంకరణలో భక్తలకు దర్శనమిస్తున్న ఆంజనేయస్వామి



లక్కిరెడ్డిపల్లె: పూజలందుకుంటున్న శ్రీ లక్ష్మీనరసింహస్వామి

వీరభద్రస్వామికి విశేష పూజలు

రాయచోటి టౌన్ : రాయచోటి శ్రీ భద్రకాళీ సమేత శ్రీ వీరభద్రస్వామి ఆలయంలో శ్రావణమాస పూజలు విశేషంగా నిర్వహించారు. శనివారం ఉదయం స్వామి వారికి, అమ్మవారికి విశేషమైన పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అనంతరం స్వామి వారిని, అమ్మవారిని రంగు రంగుల పూలు, పట్టు వస్త్రాలు, బంగారు ఆభరణాలతో అందంగా అలంకరించి భక్తుల దర్శన ఏర్పాటు చేశారు. పూజలు ఆలయ ఈఓ డీవీ రమణారెడ్డి ఆధ్వర్యంలో ఆలయ ప్రధాన అర్చకులు నిర్వహించారు.

నేటి నుంచి విగ్రహ ప్రతిష్ట ఉత్సవాలు

సిద్దవటం: మండలం లోని భాకరాపేట–సిద్దవటం మార్గంలో పరమాత్మాసేవా తపోవన వృద్ధాశ్రమంలో నూతనంగా నిర్మించిన అన్నపూర్ణ సమేత ఆదిభిక్షు ఆలయంలో ఆదివారం నుంచి విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవం, పూజలు నిర్వహిస్తామని నిర్వాహకుడు మలిశెట్టి వెంకటరమణ తెలిపారు. ఈ సదర్భంగా ఆయన మాట్లాడుతూ స్వామివారికి గంగానయనము, గణపతి పూజ, స్వస్తి పుణ్యాహవాచనము, రక్షబంధనము, మాతృకపూజ, ఋత్విగ్వరణము, యాగశాల ప్రవేశం, కలశస్థాపన, మండల ఆరాధన, మంగళహారతి, పూజలు నిర్వహిస్తామని చెప్పారు.

సిద్దేశ్వరస్వామి ఆలయంలో పవిత్రోత్సవాలు

రాజంపేట: పదకవితాపితామహుడు తాళ్లపాక అన్నమాచార్యులు జన్మస్థలి తాళ్లపాకలో వెలసిన సిద్దేశ్వరస్వామి ఆలయంలో పవిత్రోత్సవాలు సోమవారం రాత్రి ప్రారంభమైయ్యాయి. వేదపండితుల మంత్రోచ్ఛారణల మధ్య ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఇన్‌స్పెక్టర్ బాలాజీ, అర్చకులు, టీటీడీ విజిలెన్స్ సిబ్బంది పాల్గొన్నారు.

అనారోగ్యంతో వైస్ ఎంపీపీ భర్త మృతి

ఓబులవారిపల్లె: వైస్ ఎంపీపీ–2 కొమ్మూరు సుమిత్ర భర్త కొమ్మూరు నరసింహారెడ్డి (42) శనివారం అనారోగ్యంతో మృతి చెందాడు. అనారోగ్యంతో ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందారని కుటుంబ సభ్యులు తెలిపారు. మృతునికి భార్య, కుమార్తె, కుమారుడు ఉన్నారు. ప్రజా ప్రతినిధులు, సర్పంచ్‌లు, నాయకులు నరసింహారెడ్డి మృతదేహానికి ఘనంగా నివాళులు అర్పించారు. ఆదివారం మధ్యాహ్నం 12 గంటలకు నరసింహారెడ్డి మృతదేహానికి అంత్యక్రియలు నిర్వహించనున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

నేడు ఎమ్మార్పీఎస్ ఆత్మీయ సమావేశం

రాయచోటి అర్బన్: రాయచోటి పట్టణంలో ఆదివారం ఎమ్మార్పీఎస్ కార్యకర్తల ఆత్మీయ సమావేశం నిర్వహిస్తున్నట్లు ఆ సంఘం రాష్ట్రనేత ఎస్. రామాంజనేయులు ఒక ప్రకటనలో తెలిపారు. పట్టణంలోని ఎన్‌జీఓ సభాభవనంలో ఉదయం 10 గంటలకు సమావేశాన్ని నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. ఎమ్మార్పీఎస్ కార్యకర్తలు, నేతలంతా సమావేశానికి హాజరై విజయవంతం చేయాలని కోరారు.

ఆదర్శపాఠశాలలో బైస్‌లైన్ పరీక్షలు

సంబేపల్లె : మండల కేంద్రంలోని ఆదర్శపాఠశాలలో పదవ తరగతి విద్యార్థుల పబ్లిక్ పరీక్షలకు సిద్ధం చేసే క్రమంలో బైస్‌లైన్ పరీక్షలు నిర్వహించినట్లు ప్రిన్స్‌పాల్ దిలీప్‌కుమార్ తెలిపారు. శనివారం ఈ పరీక్షలను ఎంఈఓ శ్రీనివాసులు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా విద్యాశాఖ అధికారి కృష్ణారెడ్డి ఆదేశాల మేరకు నాలుగు రోజులుగా బైస్ పరీక్షలు నిర్వహించినట్లు ఆయన తెలిపారు. విద్యార్థులకు పబ్లిక్ పరీక్షలపై తగు సూచనలు సలహాలు ఇచ్చారు. అనంతరం ఆరవతరగతి విద్యార్థులకు ఆక్స్‌ఫర్డ్ నిఘంటువులను పంపిణీ చేశారు.

ప్రభుత్వ స్థలంలో హెచ్చరిక బోర్డు ఏర్పాటు



హెచ్చరిక బోర్డును ఏర్పాటు చేసిన రెవెన్యూ అధికారులు

సిద్దవటం : మండల పరిధి కనుమలోపల్లె గ్రామ సమీపంలో సర్వే నంబర్ 70/3లోని 70 సెంట్ల ప్రభుత్వ స్థలంలో శనివారం హెచ్చరిక బోర్డును ఏర్పాటు చేశామని వీఆర్‌వో నాని తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కంతా పిచ్చమ్మ అనే మహిళ ఇటీవల జిల్లా కలెక్టర్‌కు తనకు 5 సెంట్ల స్థలం ఉందని, అందులో చిన్న గుడి కట్టానని, దాన్ని తొలగించి రవిశంకర్ అనే వ్యక్తి స్థలాన్ని ఆక్రమించాడని ఫిర్యాదు చేసిందన్నారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు స్థలాన్ని తహసీల్దారు మురాషావలి పరిశీలించారని పేర్కొన్నారు. శనివారం ఆ స్థలంను సర్వే చేశామన్నారు. దాన్ని ప్రభుత్వ స్థలంగా గుర్తించామన్నారు. తహసీల్దారు ఆదేశాల మేరకు ప్రభుత్వ స్థలంలో హెచ్చరిక బోర్డును పాతామన్నారు. అయితే కోర్టులో కేసు పెండింగ్‌లో ఉన్నందున కోర్టు నిర్ణయం తీసుకునే అంత వరకు ఎవరూ అక్కడికి ప్రవేశించరాదని తెలిపారు. ప్రవేశించిన పక్షంలో శిక్షార్హులవుతారని వీఆర్‌వో తెలిపారు.

గోకుల కృష్ణా.. గోపాల కృష్ణా



రైల్వేకోడూరు అర్బన్: డాల్ఫిన్ డెల్ స్కూల్‌లో రాధాకృష్ణుల వేషధారణలో చిన్నారులు

రైల్వేకోడూరు అర్బన్: పట్టణంలోని పలు ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో ముందస్తుగా కృష్ణష్టమి వేడుకలను శనివారం వైభవంగా నిర్వహించారు. స్థానిక డాల్ఫిన్‌డెల్, సిల్వర్‌బెల్స్‌లో చిన్నారులు గోపికలు, గోపాలుల వేషధారణలతో ఆకట్టుకున్నారు. కార్యక్రమంలో తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పుల్లంపేట: పుల్లంపేటలోని శ్రీ ప్రత్యూష హైస్కూల్‌లో శనివారం ముందస్తు శ్రీ కృష్ణాష్టమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలలో బాలబాలికలు కృష్ణుడు, గోపికల వేషదారణతో అందరినీ అలరించారు. పిల్లలతో ఉట్టికొట్టే కార్యక్రమాన్ని కూడా నిర్వహించారు. ఉపాధ్యాయులు రాజశేఖర్, రవీంద్రబాబు, రాధ, బాబీ, గంగ, దివ్య, శ్రావణి, సుజాత, స్వప్న తదితరులు పాల్గొన్నారు.

రేపు శ్రీకృష్ణుడి కల్యాణం

నందలూరు: మండలంలోని నాగిరెడ్డిపల్లె మేజర్ గ్రామ పంచాయతీ, అరవపల్లెలోని శ్రీ కృష్ణ గీతా మందిరంలో శ్రీకృష్ణ జన్మాష్టమిని పురస్కరించుకొని సోమవారం రుక్మిణి, సత్యభామ సమేత శ్రీకృష్ణుని కల్యాణం అత్యంత వైభవంగా నిర్వహించనున్నట్లు నిర్వాహకులు కుర్ర మణి యాదవ్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉదయం 8 గంటలకు గోపూజ, 10 గంటల నుంచి 11.30 గంటలలోగా కల్యాణ మహోత్సవం, 12 గంటలకు జై గురుదేవ్, శ్రీ అయ్యప్ప భక్తాదులు, శ్రీకృష్ణ పాద సేవకుల సౌజన్యంతో పెద్దఎత్తున భక్తులకు అన్నదాన కార్యక్రమం, సాయంత్రం 4 గంటలకు శ్రీకృష్ణ గీతా మందిరం నుండి బస్టాండ్ కూడలి వరకు గ్రామోత్సవం, ఊరేగింపు నిర్వహిస్తామని తెలిపారు.

గాలివీడు : పట్టణంలోని స్థానిక రవిచంద్ర ఇంగ్లిష్ మీడియం హైస్కూల్‌లో శనివారం ముందస్తు శ్రీ కృష్ణాష్టమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాలలోని చిన్నారులు శ్రీ కృష్ణుడు, గోపికల వేషధారణతో ఆకట్టుకున్నారు. సంస్కృతి సాంప్రదాయాలు ప్రతిబింబించేలా ఉట్టికొట్టే కార్యక్రమంలో చిన్నారులు ఉత్సాహంగా పాల్గొన్నారు.

పవన్ పర్యటనతో ఒరిగిందేమీ లేదు



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే కొరముట్ల

రైల్వేకోడూరు అర్బన్: ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ పర్యటన వలన రైల్వేకోడూరు నియోజకవర్గానికి ఒరిగిందేమీ లేదని మాజీ ఎమ్మెల్యే కొరముట్ల శ్రీనివాసులు ఎద్దేవాచేశారు. శనివారం స్థానిక కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ పవన్ కల్యాణ్‌పర్యటనలో నియోజకవర్గానికి నిధులు కేటాయిస్తారని అందరూ భావించారని, ఎలాంటి హామీలు ఇవ్వకుండా ప్రజలను నిరాశకు గురిచేశారని విమర్శించారు. గ్రామ స్వరాజ్యం మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పరిపాలనలో గ్రామగ్రామాన జరిగిందని తెలిపారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి గ్రామాల అభివృద్ధికి ఎలాంటి ప్రణాళికలు రచించలేదని ఆరోపించారు. టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు దౌర్జన్యాలు, కబ్జాలు, దాడులకు పాల్పడుతున్నారని మండిపడ్డారు. రాష్ట్రంలో లోకేష్ రెడ్ బుక్ రాజ్యాంగం నడుస్తోందని విమర్శించారు. కూటమి ప్రభుత్వంలో ఆలయాలు, మసీదులు, చర్చిల ఆస్తులకు రక్షణ లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్నికల హామీలను ముఖ్యమంత్రి చంద్రబాబు అమలు చేయాలని డిమాండ్ చేశారు.

పెండింగ్ కేసులు పూర్తి చేయండి



సిబ్బందితో మాట్లాడుతున్న డీఎస్పీ సుధాకర్

ఓబులవారిపల్లె: పెండింగ్‌లో ఉన్న కేసులను త్వరగా పూర్తి చేయాలని రాజంపేట డీఎస్పీ సుధాకర్ సిబ్బందిని ఆదేశించారు. శనివారం స్థానిక పోలీస్ స్టేషన్‌ను డీఎస్పీ ఆకస్మికంగా తనిఖీ చేశారు. అనంతరం పోలీస్ స్టేషన్‌లోని రికార్డులను పరిశీలించి సిబ్బందికి తగు సూచనలు, సలహాలు ఇచ్చారు. అనంతరం డీఎస్పీ మాట్లాడుతూ అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. అక్రమ ఎర్రచందనానికి పాల్పడితే కఠిన చర్యలు తప్పవన్నారు. చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే సహించేది లేదని చెప్పారు. రైల్వేకోడూరు ఎస్ఐ వెంకటేశ్వర్లు, ఏఎస్ఐ శ్రీనివాసులు, సిబ్బంది పాల్గొన్నారు.

మెరుగైన సేవలందించాలి

రాజంపేట: ప్రజలకు పోలీసుశాఖ పరంగా మెరుగైన సేవలందించాలని రాజంపేట డీఎస్పీ సుధాకర్ కోరారు. సోమవారం సబ్‌డివిజన్ స్థాయిలో వివిధ ప్రాంతాల పోలీసు అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెండింగ్ కేసులను త్వరితగతిన పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. మట్కా, గ్యాంబ్లింగ్, కోడిపందేలు లాంటి అసాంఘిక కార్యకలాపాలను అరికట్టాలని తెలిపారు. సీఐలు, ఎస్ఐలు పాల్గొన్నారు.

నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు

రాయచోటి (జగదాంబసెంటర్): ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఏదీ డిగ్రీ పూర్తి చేసి వారికి జీఈఎన్‌పీఏసీటీ కంపెనీలో ఉద్యోగ అవకాశాలు ఉన్నట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి హరికృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. 2022/2023/2024 సంవత్సరాలలో ఏదైనా డిగ్రీ/బీటెక్ లేదా పీజీ పూర్తి చేసిన నిరుద్యోగ యువతకు ఉద్యోగ కల్పనలో భాగంగా జెన్పాక్ట్ సంస్థతో వాక్ ఇన్ ఇంటర్వ్యూ కార్యక్రమం నిర్వహిస్తున్నామని తెలిపారు. కంటెంట్ మోడరేషన్, కస్టమర్ సర్వీస్–వాయిస్ సపోర్ట్ ఉద్యోగాలు ఖాళీలు ఉన్నట్లు తెలిపారు. అర్హత, ఆసక్తి, ఇంగ్లిష్ భాషా నైపుణ్యం కలిగిన నిరుద్యోగ యువతీ యువకులకు హెచ్‌ఆర్ రౌండ్, టెక్నికల్ రౌండ్ ఇంటర్వ్యూలు నిర్వహించి ఎంపిక చేస్తామన్నారు. వివరాలకు 8897776368, 7799587687 నంబర్లను సంప్రదించాలని కోరారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత



అర్జీలు స్వీకరిస్తున్న మంత్రి రాంప్రసాద్‌రెడ్డి

చిన్నమండెం : ప్రజా సమస్యల పరిష్కారానికి అధిక ప్రాధాన్యత ఇస్తున్నట్లు రాష్ట్ర యువజన, క్రీడా, రవాణా శాఖా మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి తెలిపారు. మండల పరిధిలోని బోరెడ్డిగారి పల్లెలోని తన నివాసంలో నిర్వహించిన ప్రజాదర్బార్ నిర్వహించారు. ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ అన్నమయ్య జిల్లాలో ప్రజలు సమస్యలతో బాధపకూడదనే ఉద్దేశ్యంతో ప్రజాదర్బార్ నిర్వహిస్తున్నామని తెలిపారు.

ప్రత్యేక పూజలు

మండల పరిధిలోని పడమటికోన గ్రామంలో శ్రీ చౌడేశ్వరీదేవి ఆలయంలో కుటుంబసమేతంగా, నడిగడ్డపల్లె, పడమటికోన గ్రామంలో సీతారామాలయం విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమంలో మంత్రి రాంప్రసాద్‌రెడ్డి పాల్గొన్నారు.

ధర్నాను జయప్రదం చేయండి

గాలివీడు : విద్యుత్ కార్మికుల సమస్యల పరిష్కారం కోసం సెప్టెంబర్ 5 న నిర్వహిస్తున్న ధర్నాను జయప్రదం చేయాలని సీఐటీయూ డివిజన్ ప్రధాన కార్యదర్శి దాసరి శ్రీనువాసులురెడ్డి పిలుపునిచ్చారు. శనివారం గాలివీడులో పర్యటించిన ఆయన స్థానిక విద్యుత్ కార్యాలయంలో కరపత్రాలను పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యుత్ కాంట్రాక్ట్ వర్కర్లు, మీటర్ రీడర్స్, పీసు రేటులో పనిచేస్తున్న స్టోర్స్ హమాలీలు, బిల్ కలెక్టర్లు, జన్‌కో కార్మికుల సమస్యల పరిష్కారం కోసం అన్ని విద్యుత్ కార్యాలయాల వద్ద ధర్నా నిర్వహించాలని పిలుపునిచ్చారు.

వంద శాతం గర్భిణుల నమోదు లక్ష్యం

లక్కిరెడ్డిపల్లె : నీతి ఆయోగ్ కార్యక్రమంలో భాగంగా సంపూర్ణత అభియాన్ కార్యక్రమంకు సంబంధించి మండలంలోని గర్భిణులను వందశాతం నమోదు చేసి వారికి షుగర్, బీపీ వంటి పరీక్షలు నిర్వహించాలని కోనంపేట వైద్యాధికారి బోదనపు సిద్దయ్య పేర్కొన్నారు. శనివారం మండలంలోని కోనంపేట పీహెచ్‌సీలో ఏఎన్ఎం, ఆశాకార్యకర్తలు, సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని గర్భిణులను గుర్తించి వారికి ఎప్పటికప్పుడు వైద్య పరీక్షలు నిర్వహించాలని సిబ్బందికి సూచించారు. ఏవైనా సమస్యలు ఉంటే వారికి మందులు పంపిణీ చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో నీతి ఆయోగ్ అధికారి వెంకటరామిరెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

యాజమాన్య పద్ధతులతో దిగుబడి

రాయచోటి: జిల్లాలో వర్షాభావం కారణంగా ఖరీఫ్ సీజన్‌లో వరిపంట సాగు అంతంత మాత్రంగానే సాగు చేశారు. కొన్నిచోట్ల నాట్లు వేయడం పూర్తవగా, మరికొన్నిచోట్ల కలుపు దశలో ఉంది. వరిపంటలో కలుపు ప్రధాన సమస్య. వరిలో వచ్చే కలుపును సకాలంలో నియంత్రించకుంటే దిగుబడి తగ్గే ప్రమాదం ఉందని రాయచోటి వ్యవసాయ అధికారి దివాకర్ బాబు సూచించారు. వరిసాగు చేసిన రైతులకు ఒకవైపు కూలీల సమస్య, మరోవైపు వర్షాభావం వలన కలుపు యాజమాన్యం భారంగా మారిందని తెలిపారు. వరినాట్లు నాటిన 3 నుంచి 4 రోజుల్లోనే కలుపు మందు పిచికారీ చేస్తే కలుపు సమస్యను తగ్గించి అధిక లాభాలు పొందడానికి అవకాశం ఉంటుంది. దీనితో పాటు కలుపు నివారణకోసం సమగ్ర యాజమాన్య పద్ధతులు పాటిస్తే మంచి నాణ్యమైన దిగుబడి పొందేందుకు వీలుంటుంది.

యాజమాన్య పద్ధతులు గురించి తెలుసుకుందాం

వరిలో కలుపు ఎక్కువగా ఉంటే మొక్కకు అందవలసిన పోషకాలు అన్ని కలుపు మొక్కలే లాగేసుకుంటాయి. వరినాట్లు నాటిన 3 నుంచి 5 రోజుల వ్యవధిలో కలుపు రాకుండా నివారించగలిగే మందులను పిచికారీ చేసుకోవాలి. ఇందుకోసం బ్యూటక్లోర్ ఒక లీటర్ మందును 20 కిలోల ఇసుకలో కలిపి పొలాల్లో చల్లాలి. మందు చల్లక ముందు, చల్లిన తరువాత నీరు పెట్టకుండా ఉంటే మందు ప్రభావవంతంగా పనిచేస్తుంది. దీనితో పాటు ఆక్సీడైజోల్ 2 గ్రాములు చొప్పున ఒక లీటర్ నీటికి కలుపుకొని మొక్కలపై పిచికారీ చేయాలి.

తుంగ, గరిక ప్రభావం

వరిపంటలో తుంగ, గరిక సమస్య అధికంగా ఉన్న ప్రాంతాలలో లాండాక్స్ పవర్ అనే మందును 2.5 మిల్లీ గ్రాములు ఒక లీటర్ నీటికి కలిపి పిచికారీ చేస్తే కలుపును రాకుండా నివారించవచ్చు. అదే విధంగా తరచూ పొలంలో వచ్చే కలుపును చేతితో నివారిస్తూ ఉండాలి. ఈ విధంగా వరిలో కలుపు యాజమాన్య పద్ధతులు సమయానుసారంగా పాటిస్తే మంచి దిగుబడులు పొందడానికి అవకాశం ఉంటుంది.